ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 28 సెప్టెంబరు 2025

స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు



- జడ్పీ చైర్మన్ జనరల్ మహిళ
- బీసీలకు 6 జడ్పీటీసీ, 5 ఎంపీపీ స్థానాలు
- మహిళలకు 6 జడ్పీటీసీలు, 5 ఎంపీపీ స్థానాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రధానమైన జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం జీవో నంబరు 9 జారీ చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు, 2024 కులగణన సర్వే ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా బీసీల జనాభా వివరాలను ఐదు రోజుల క్రితమే కలెక్టర్లకు అందించింది. ఈ నెల 24వ తేదీ నాటికి సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు స్థానాలు ఎంపీపీలు, జడ్పీటీసీల రిజర్వేషన్లను రొటేషన్ ప్రకారం ఖరారు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించాల్సి ఉండడంతో బీసీ రిజర్వేషన్ల జీవో విడుదలైన తర్వాత శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, డి వేణు, జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఆర్డీఓలు గంగయ్య, సురేష్, మహిళా స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్సీ, జనరల్ స్థానాలకు రొటేషన్‌లో ఖరారు చేయగా, పెరిగిన బీసీ స్థానాలకు సంబంధించి కొన్నింటికి డ్రా తీసి నిర్ణయించారు. అయితే రిజర్వేషన్ల జాబితాలను సంబంధిత అధికారులు కలెక్టర్ సంతకం లేకుండా విడుదల చేయలేదని చెబుతున్నారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశానికి కలెక్టర్ వెళ్లగా, అధికారికంగా రిజర్వేషన్ల జాబితాలు ఆదివారం విడుదల చేయనున్నారు.

రిజర్వేషన్లు ఇలా..

జిల్లా పరిషత్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు కేటాయించారు.

మిగతా 8వ పేజీలో

దూరవిద్యలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగం చేస్తున్న వారు ఓపెన్ డిగ్రీలో చేరేందుకు అవకాశమన్నారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన వారు కూడా డిగ్రీలో చేరడానికి అడ్మిషన్ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఫారాలను, సర్టిఫికెట్స్‌ను కళాశాలలో అక్టోబర్10వ తేది లోపు ఇవ్వాలని తెలిపారు.

స్వరాష్ట్ర సాధనకు కృషి చేసిన

కొండా లక్ష్మణ్ బాపూజీ 8

ఏటీసీ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలి



పెద్దపల్లిలో ఏటీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏటీసీ నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం ప్రభుత్వ ఐటీఐ కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2324 కోట్లకుపైగా ఖర్చు చేసి ప్రజా ప్రభుత్వం 65 ఐటీఐ సెంటర్‌లను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. ఏటీసీలో నైపుణ్య శిక్షణ పొందిన పిల్లలకు కనీసం రూ.20 వేల ప్రారంభ వేతనంతో ఉపాధి లభించేలా అనేక కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు విద్యార్థుల కు అందించేందుకు టాటా సంస్థ సహకారంతో వివిధ కోర్సులు ఏటీసీలో విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు. జిల్లాలో ఏటీసీలో 250పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. పెద్దపల్లిలో ఐటీఐ ఏర్పడి 65 ఏళ్ల దాటిందని, ఇక్కడ కోర్సులు చేసిన అభ్యర్థులు సింగరేణిలో అనేక అవకాశాలు పొందారన్నారు. ప్రస్తుత ఏటీసీ సెంటర్ ద్వారా అందించే నైపుణ్య శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తల్లితండ్రులు ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి కోర్సులనే కాకుండా ఉపాధి అవకాశాలు సత్వరం లభించే ఏటీసీ కోర్సుల వైపు కూడా పిల్లలను ప్రోత్సాహించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. తల్లితండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా పిల్లలు బాగా చదువుకొని జిల్లాకు పేరు తీసుకుని రావాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతున్నారు

సామాజిక వేదికలో టెక్నికల్ అసిస్టెంట్ ఆవేదన



అధికారుల ఎదుట టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్ వాగ్వాదం

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) :ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలతో సజావుగా పనులు నిర్వహిస్తున్నా ఆడిట్ అధికారులు జరిమానాలు విధించాలని నివేదికలు అందిస్తూ, చిన్న తప్పును పెద్దగా చిత్రీకరిస్తున్నారని ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ బొంగోని వెంకటేష్ గౌడ్ సామాజిక వేదికలో ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బ్రాహ్మణపల్లి రైతువేదికలో 2024-25కి సంబంధించిన ఉపాధిహామీ పనులపై ఆడిట్ నిర్వహించగా సామాజిక వేదిక సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా నివేదికలు అందిస్తున్న దృష్ట్యా తుర్కల మద్దికుంటలో చెరువు పూడికతీత పనుల్లో భాగంగా 104 మంది ఉపాధి కూలీలు ఒకే తీరుగా పనులు చేపట్టారని రికార్డు నమోదు చేసినట్లు ఆడిట్ చేపట్టిన అధికారులు నివేదిక ఇచ్చే క్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. ఆడిట్ చేపడుతున్న తరుణంలో ఇబ్బందులు పెడుతున్నారని గతంలో లక్షల రూపాయలు జరిమానాలు విధిస్తే చెల్లించానని వేదికలో పేర్కొన్నాడు. ఎస్ఆర్‌పీ టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతూ పలు రకాలుగా డిమాండ్‌లు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పాల్గొన్న ఏపీడి సత్యనారాయణ జోక్యం చేసుకొని సముదాయించారు. సామాజిక వేదిక సజావుగా కొనసాగింది. 30 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల నివేదికను సమర్పించారు.

ఉపాధి పనులు సజావుగా నిర్వహించాలి

గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులు సజావుగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ పీడీ సత్యనారాయణ అన్నారు. శనివారం బ్రాహ్మణపల్లి రైతువేదికలో నిర్వహించిన సామాజిక వేదికలో పాల్గొన్నారు. గ్రామాల వారీగా చేపట్టిన పనుల వివరాలు వివరించగా నమోదు చేసుకొని తప్పిదాలు జరిగిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా 30 గ్రామ పంచాయతీల్లో తప్పిదాలు చేసి నందుకు రూ.13వేల 186లు జరిమానా విధించారు. కొమురయ్య, ఎస్ఆర్‌పీ ప్రదీప్, ఎంపీవో ఫయాజ్, పంచాయతీ రాజ్ ఏఈ పవన్, క్వాలిటీ కంట్రోల్ హరి, ఏపీవో రమేష్ బాబు, జేఈ రాజయ్య, సుజాత, టెక్నికల్ అసిస్టెంట్‌లు వెంకటేష్, దివ్య, సురేష్,కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వే గేటు

● వాహనాల దారి మళ్లింపు



గేటు వద్ద ప్రయాణికులు

గంగాధర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధాన రహదారిపై గల రైల్వేగేటు శనివారం మొరాయించింది. గేటు లేవక పోవడంతో గంటపాటు భారీగా వాహనాలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బంది పడ్డారు. శనివారం రైలు వెళ్లడంతో ప్రధానరహదారిని సిబ్బంది గేటువేసి దారిని మూసివేశారు. ఆటోమెట్‌గా గేటు పడగా దారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రైలు వెళ్లాక గేటును ఎత్తడా నికి సిబ్బంది ప్రయత్నించగా ఒకవైపు గేటు లేవకుండా మొరాయించింది. సిబ్బంది మరమ్మతులు జరిపి గేటు ఎత్తారు. గేటు మొరాయించని విషయం గమనించి అధికారులు కరీంనగర్, నిజామాబాద్‌వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. మల్యాల మీదుగా తాటిపెల్లి, గంగాధర మండలం ర్యాలపల్లి, బూరుగుపల్లి, లక్ష్మీదేవిపల్లి, గంగాధర మీదుగా కరీంనగర్ మళ్లించారు. పండగ సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో సెలవులకు ఇళ్లకు వస్తున్న విద్యార్థులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు. విధులు ముగించుకుని ఇళ్లకు వెళుతున్న వారు గంటపాటు నిరీక్షించాల్సి వచ్చింది. గత శుక్రవారం కూడా గేటు పైకి లేవలేదు. తరచూ ఇదే పరిస్థితి ఎదురవుతోందని ప్రయాణి కులు వాపోయారు. అధికారులు గేటు మొరాయించకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నా భర్త మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించండి..

● కేంద్ర మంత్రికి మహిళ విజ్ఞప్తి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశానికి వలస వెళ్లి గుండెపోటుతో మృతిచెందిన తన భర్త మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన దేవోళ్ల హన్మంతు భార్య పద్మ శనివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆమె ఒక లేఖ రాశారు. హన్మంతు ఉపాధి లేక రూ.6లక్షలు అప్పులు చేసి బహ్రెయిన్ దేశానికి ఏడాదిన్నర కిందట వలస వెళ్లగా ఈనెల 26న గుండెపోటుతో చనిపోయాడని, మృతదేహం కోసం పడిగాపులు కాస్తున్నామని పేర్కొన్నారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చేలా చేసి, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరింది.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో అచేతనంగా పడి ఉన్న గుర్తు తెలియని వృద్ధుడి(65)ని 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈనెల 25న ఉదయం బస్టాండ్‌లోని 19వ ప్లాట్‌ఫాం వద్ద పడి ఉన్న వృద్ధుడు(65)ను ఆర్టీసీ సిబ్బంది గుర్తించి 108సిబ్బందికి సమాచారం అందించారు. అతడిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి రెండు కాళ్లకు పుండ్లతో బ్యాండేజ్ ఉందని, గుర్తించినవారు కరీంనగర్ వన్‌టౌన్ సీఐ 8712670761, పోలీస్‌స్టేషన్ 8331940591లో సమాచారం అందించాలని పేర్కొన్నారు.

పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా

● వరద కాలువ గట్టుపై డంపులు ● రోడ్లు ధ్వంసం..రాకపోకలకు అవస్థలు ● చోద్యం చూస్తున్న ఎస్సారెస్పీ అధికారులు



పెద్దవాగులో ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు



తక్కళ్ళపల్లి శివారులో ఇసుక డంప్

కథలాపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దవాగు ఇసుక అక్రమార్కులకు వరంలా మారింది. భారీఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తరలిస్తున్న ఇసుకను వరద కాలువగట్టుపై నిల్వచేస్తున్నారు. కథలాపూర్, దూలూరు, దుంపెట, బొమ్మెన, తక్కళ్ళపల్లి, భీమారం మండలం మన్నెగూడెం శివారు దాకా వరద కాలువపై రెండు కిలోమీ టర్లమేర అడుగడుగునా డంపులు దర్శనమిస్తున్నాయి. దూలూరు, బొమ్మెన, తక్కళ్లపల్లి గ్రామా లమీదుగా పెద్దవాగు ప్రవహిస్తోంది. ఈవ్యవహారం బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమార్కులు వీడీసీలకు డబ్బులు చెల్లించి ఇష్టారాజ్యంగా ఇసుక తీసుకు వెళ్తున్నారు. వరదకాలువ వాగుకు సమీపంలోనే ఉండడంతో అడ్డాగా మార్చుకుని భారీగానిల్వలు చేసుకుంటున్నారు. ప్రతిరోజు పదులసంఖ్యలో ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రోడ్డుదెబ్బతిన్నది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. పొద్దంతా నిల్వచేస్తున్న డంపులను రాత్రివేళల్లో టిప్పర్లలో నిర్మల్, ఆర్మూర్, జగిత్యాల, భీంగల్ వంటి ప్రాంతాలకు విక్రయిస్తున్నారని తెలిసింది. జిల్లాల సరిహద్దులను దాటించడానికి ప్రత్యేకంగా వ్యక్తులను నియమించుకుంటున్నారు. వరద కాలువను పర్యవేక్షించే ఎస్సారెస్పీ అధికారులు, సిబ్బంది ఎందుకు డంపుల నిల్వలకు అనుమతి ఇస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల మధ్యవంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నందు వల్ల కథలాపూర్ మండల కేంద్రానికి చేరుకోవాలంటే వరద కాలువ వెంటే వెళ్లాలి. ట్రాక్టర్లు,టిప్పర్లు నిత్యం నడుస్తున్నందు వల్ల రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. ఇసుక అక్రమరవాణా చేస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లను రెవెన్యూ, పోలీస్ పట్టుకున్న సందర్భాల్లో నామమాత్రపు జరిమానాలు విధించి వదిలేస్తుండడంతో మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందనే విమర్శలు వస్తున్నాయి.

రిటైర్డు ఉద్యోగుల సమస్యల సాధనకు కృషి

● రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల సమస్యల సాధనకు కృషి చేయనున్నట్లు రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి పేర్కొన్నారు. రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా) ఉమ్మడి కరీంనగర్‌జిల్లా అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు కోహెడ చంద్రమౌళి ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని ఫిలింభవన్‌లో జరిగిన రేవా సమావేశంలో రిటైర్డు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాటి పరిష్కారం కోసం రేవా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించి కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా సుంకిశీల ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులుగా గద్దె జగదీశ్వరాచారి, ఆర్.శ్రీనివాస్ స్వామి, ఎం.భారతి, కోశాధికారిగా కనపర్తి దివాకర్, కార్యదర్శులుగా ఖాజాఅల్తాన్ అహ్మద్,ఎ.రాంరెడ్డి, ఆర్.సీతారాంరెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్.రవీంద్ర కుమార్, పి.నరసయ్య, ఆడిట్‌కమిటీ కన్వీనర్‌గా బూరుగుపల్లి రవీందర్, సభ్యులుగా ఎం.మొగిలయ్య, జి.రవీందర్‌లను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్‌సెక్రటరీలుగా ఎన్.సత్యనారాయణరెడ్డి,జి. రవీందర్ రావు, పి.మోహన్‌రావు, రామకవితలశర్మ, మహేందర్‌రెడ్డి, పాలోజి రవీందర్, కె.వెంకట్‌రాములు, ఎం.లక్ష్మీనారాయణ, గోకుల రామన్న ఎన్నికయ్యారు. ఎన్నికలఅధికారిగా సోనుమల్లరాములు, ఎన్నికల పరిశీలకుడిగా కత్రోజుప్రభాకర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా రేవా అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ సంవత్సరన్నర కాలంగా పెన్షన్ తప్ప ఇతర ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వకపోవడంతో మానసిక క్షోభకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మనోవేదనతో కొందరు అసువులు బాసినవాళ్లు కూడా ఉన్నారని చెప్పారు. దాదాపు 200మంది ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ పొందినవారికి వెంటనే జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌హాన్స్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందించాలని,ప్రభుత్వంఇచ్చేవరకు ఒత్తిడితేవాలని తీర్మానించారు.

పేద యువతులకు వరం కళ్యాణలక్ష్మి



శంకరపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్/శంకరపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కళ్యాణలక్ష్మి పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్, శంకరపట్నంలోని రైతువేదికల్లో శనివారం కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుపేద ఆడపడుచుల పెళ్లిళ్లకు లక్ష రూపాయలను రాష్ట్రప్రభుత్వం అందజేస్తూ అండగా ఉందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని 71మందికి చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు, వైస్‌చైర్మన్ తిరుమల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, శంకరపట్నంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, కొత్తగట్టు ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ లక్షణాలతో బాలుడి మృతి



శ్రేయస్(ఫైల్)

కోనరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూతో లక్షణాలతో బాలుడు మృతిచెందిన సంఘటన కోనరావుపేట మండలకేంద్రానికి చెందిన పాక శ్రేయస్(4) మృతిచెందాడు. మండలకేంద్రానికి చెందిన పాక మహేష్ గంగజల దంపతుల చిన్న కుమారుడు శ్రేయస్ నాలుగు రోజులక్రితం జ్వరం రావడంతో సిరిసిల్ల ప్రైవేట్‌ఆసుపత్రిలో చూపించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. బాలుడికి డెంగ్యూ జ్వరం విషమంగా ఉండడంతోనే మృతిచెందాడని వైద్యులు తెలిపారని బాలుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

యువకుడి దారుణ హత్య



సతీష్(ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబర్, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో సతీష్(29) అనే యువకుడు శనివారం దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రేచపల్లి గ్రామానికి చెందిన సతీష్ అదేగ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించానని ఆమెను ఎవరూ పెళ్ళి చేసుకోవద్దని సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టాడు. దీంతో సదరుయువతి కుటుంబసభ్యులు పలుమార్లు సతీష్‌ను మందలిం చారు. అయిన సతీష్‌లో మార్పురాలేదు. శనివారం రాత్రి8గంటల ప్రాం తంలో యువతి కుటుంబసభ్యులకు, సతీష్‌కు మధ్య మాటమాట పెరగ డంతో కర్రలతో సతీష్‌పై మూకుమ్మడిగా దాడిచేశారు. దీంతో సతీష్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు.సంఘటనస్థలాన్ని జగిత్యాల రూరల్‌సీఐ సుధాకర్, బీర్‌పూర్‌ఎస్సైరాజు పరిశీలించి విచారణ చేపట్టారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

చొప్పదండి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణ శివారులోని మర్లవాడ వద్ద బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. చొప్పదండికి చెందిన పెద్దెల్లి అంజయ్య(42) శుక్రవారం రాత్రి మర్లవాడ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన బైక్‌ఢీకొట్టింది. దీంతో అంజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడడు. అంజయ్య భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులపల్లి గ్రామశివారులోని ఫ్లైఓవర్‌బ్రిడ్జివద్ద శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనిగుర్తుతెలియని మహిళ మృతిచెందింది. మహిళకు సుమారు 40-50 మధ్య వయస్సు ఉంటుందని, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు 8712656507, 8712659486 నెంబర్ నందు సంప్రదించాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మంథనిరూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామసమీపంలో మంథనిడిపోకు చెందిన ఆర్టీసీబస్సు ఏపీ15జెడ్ 0014 అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని శనివారం ఢీకొట్టింది. మంథని నుంచి ఆరెంద గ్రామానికి వెళ్ళి తిరిగి మంథనికి వస్తుండగా వెంకటాపూర్ సమీపంలో భారీ గుంతలు ఉండటంతో వాటిని తప్పించే క్రమంలో బస్సు ముందు ఉన్న పట్టి విరగడంతో అదుపుతప్పి రోడ్డు పక్కకువెళ్ళింది. పక్కనేఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొనిబస్సు నిలిచి పోయింది. ప్రమాదం జరిగినసమయంలో బస్సులో36మంది ప్రయాణి కులున్నారు. బస్సు లోయలోకి వెళ్ళకుండా స్తంభాన్ని ఢీకొని ఆగిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపడకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

● పది గొర్రెలు మృతి

సుల్తానాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్-కాట్న పల్లి గ్రామాల మధ్యన రాజీవ్ రహదారిపై గొర్రెల మంద వెళ్లుతుండగా ఆర్టీసీ బస్సు మందపైకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో పదిగొర్రెలు బస్సు టైర్ల కిందపడి మృతిచెందగా, మరికొన్నితీవ్రంగా గాయపడ్డాయి. కరీంనగర్‌టూ డిపోకుచెందిన పల్లెవెలుగు ఆర్టీసీబస్సు గోదావరిఖనికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గొర్రెలపెంపకం ద్వారానే తాను జీవనోపాధి పొందుతున్నానని, తనకుకలిగిననష్టానికి పరిహారం అందించి ఆదుకోవాలని గొర్రెల కాపరి కూకట్లరాజయ్య ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులకు సమాచారంఅందించగా,వారు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన గన్నేరువరం ప్రజలు

● మానేరు నదిపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్

● మూడు వందల మందితో కదిలిన మండల ప్రజలు



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసిన మండల ప్రజలు

గన్నేరువరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం నుంచి ఎలగందుల వరకు మానేరునదిపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండల ప్రజలు సుమారు మూడు వందల మందితో రెండు బస్సులు, 20కార్లు, 50బైకులతో శనివారం మండలకేంద్రం నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో కలిశారు. బ్రిడ్జి రూటును మార్చి ప్రజల సౌకర్యానికి అనుకూలంగా నిర్మించాలని కోరారు. అనంతరం కరీంనగర్‌కు వెళ్లి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి గన్నేరువరం నుంచి బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. గన్నేరువరం నుంచి ఎలగందుల వరకు బ్రిడ్జి నిర్మిస్తే కరీంనగర్‌కు దూరభారం భారీగా తగ్గి మూడు మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. దీనికి ఎమ్మెల్యే, ఎంపీలు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రిడ్జి జేఏసీ నాయకులు, అఖిలపక్ష పార్టీల నాయకులు, వివిధ కులసంఘాల నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వేములవాడలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరం

● జనసంద్రంగా మారిన మూలవాగు తీరం



మూలవాగు తీరంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మూలవాగు తీరంలో ఏడోద్దుల సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చుకుని తీసుకువచ్చిన మహిళలు, యువతులతో మూలవాగు బతుకమ్మ ఘాట్ జనసంద్రంగా మారింది. బతుకమ్మ సంబరాలకు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బతుకమ్మ ఘాట్ వద్దకు వచ్చిన ఆది శ్రీనివాస్ ఎస్పీ మహేష్ బి గితే, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలిసి బెలున్ ఎగరవేసి బతుకమ్మ సంబరాలను ప్రారం భించారు. సంబరాల్లో ప్రజాగాయకురాలు, బహుజన బతుకమ్మ రాష్ట్ర కన్వీనర్ విమలక్క, మాజీడిప్యూటీస్పీకర్ పద్మదేవందర్‌రెడ్డి, ఉమ్మడికరీంనగర్ జిల్లా మాజీజడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, సిరిసిల్ల జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న పద్మదేవేందర్‌రెడ్డి, తుల ఉమ తదితరులు

వైభవంగా దేవీ నవరాత్రోత్సవాలు

● తీరొక్క పూలతో ముస్తాబైన రాజన్న ఆలయం

● స్కందమాత అలంకారములో అమ్మవారి దర్శనం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో దేవినవరాత్రోత్సవాల్లో శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరోరోజు శనివారం రోజున రాజరాజేశ్వరీదేవి అమ్మవారు స్కంద మాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా రాజన్నఆలయానికి వచ్చినభక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. కాగా శనివారం వేములవాడలో సద్దులబతుకమ్మ వేడుక సందర్భంగా రాజన్న ఆలయాన్ని అధికారులు తీరొక్కపూలతో అందంగా అలంకరించారు.

కాత్యాయని రూపంలో అమ్మవారు..

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా(దేవి) నవరా త్రోత్సవాలు ఆరవ రోజు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ రోజు అమ్మవారలు ఆకు పచ్చనిరంగు చీరెలో, మల్లెపూలు, బిల్వ పత్రి దండలు ధరించి కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. మూల నక్షత్రం సందర్భంగా సరస్వతి పూజ, పుస్తక పూజలు నిర్వహించారు. అంతకుముందు శ్రీలక్ష్మీ నృసింహస్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, రుత్వికులు భరత్‌శర్మ, దుద్దిళ్ల నారాయణశర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య కలశ, గణపతి, స్థాపిత దేవతల, చతుషష్టి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద చాడ బుచ్చన్న-పద్మ, హరికృష్ణ-రమ్య దంపతులు సుమారు 3,500మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే చిన్నారులచే భరత నాట్యం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, బాదినేని వెంకటేష్, బొల్లారపు పోచయ్య, గుడ్ల రవీందర్, కామిరెల్లి పవన్‌కుమార్ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వేములవాడలో స్కందమాత అలంకారంలో



ధర్మపురిలో కాత్యాయని రూపంలో ..



కొండగట్టులో లలితాదేవిగా అమ్మవారు

కొండగట్టులో లలితాదేవిగా..

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ

● పట్నంవాసులు పల్లెలకు పయణం



రేణికుంట టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ

తిమ్మాపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివారం కావడంతో పాటు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం విద్యా సంస్థలకు దసరా సెలవులు కూడా ఇప్పటికే ఇవ్వడంతో చాలా మంది హైదారాబాద్, దాని చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వారి సొంత గ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో శనివారం సాయంత్రం నుంచి హైదరాబాద్-కరీంనగర్ రాహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. మండలంలోని రేణికుంట గ్రామం రాజీవ్ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు హైదారాబాద్ నుంచి కరీంనగర్‌వైపు వచ్చే వాహనాల రద్దీ ఎక్కువగా కనిపించింది. దీంతో వాహనదారులు ట్రాఫిక్‌తో కొద్దిగా ఇబ్బంది పడ్డారు. టోల్‌గేట్ నిర్వాహకులు, సిబ్బంది వాహనాలను త్వరగా పంపించేందుకు శ్రమించారు.

సీసీఆర్టీ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయురాలు



సర్టిఫికెట్ అందుకుంటున్న ఉపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి

చందుర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన రామగిరి స్వరాజ్యలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు ఢిల్లీలో జరిగిన సెంటర్‌ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లానుంచి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంనుంచి 9మంది ఉపాధ్యాయులు సీసీఆర్టీకి ఎంపికకాగా, 10 సెప్టెంబరు నుంచి24వరకు 15రోజులపాటు శిక్షణ పొందారు. స్వరాజ్యలక్ష్మికి సీసీఆర్టీ డైరెక్టర్ రాజీవ్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలిని మండల విద్యాధికారి వినయ్‌కుమార్, పీఆర్టీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకిషన్ పలువురు ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

జిల్లా సెషన్స్ జడ్జిలుగా పలువురికి ప్రమోషన్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జ్యూడిషియల్ విభాగంలో పలువురు జడ్జిలకు పదోన్నతి కల్పిస్తూ శనివారం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సిరిసిల్ల 1వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి పుష్పలతకు, కరీంనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, పెద్దపల్లి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె. స్వప్నరాణి, కరీంనగర్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె. వెంకటేశ్, సిరిసిల్ల జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాధిక జైస్వాల్‌లకు జిల్లా సెషన్స్ జడ్జిలుగా ప్రమోషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

బీసీ రిజర్వేషన్ల జీవో దేశ చరిత్రలోనే ఒక మైలురాయి

గణేష్‌నగర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీరిజర్వేషన్ల జీవోజారీ దేశ చరిత్రలోనే ఒక మైలురాయి అని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రప్రభుత్వం జీవో జారీచేయడంపై నగరంలోని తెలంగాణ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవోజారీచేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ముఖ్యమంత్రి బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంతో బీసీల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పులి అంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నాయకులు అకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, ఆకులనర్సన్న, మూల రవీందర్‌రెడ్డి, జీఎస్‌ఆనంద్, పొన్నంశ్రీనివాస్ గౌడ్, యాగన్లఅనిల్‌కుమార్,గుర్రం అశోక్ గౌడ్, అనంతుల రమేష్ పాల్గొన్నారు.

కంటే కూతురినే కనాలి..

నేడు ప్రపంచ కూతుళ్ల దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నుంచి మన దేశంలో ఇంట్లో పుట్టిన అబ్బాయిలను ఎక్కువగా, అమ్మాయిలను తక్కువగా చూసే అలవాటు ఉంది. హాస్పిటల్‌లలో సైతం తల్లి జన్మనివ్వగానే పుట్టింది ఆడపిల్ల అని తెలిస్తే పెదవి విరుస్తున్నారు. మరి కొందరు అక్రమంగా అన్యాయంగా మొదలే వైద్య పరీక్షల ద్వారా తెలుసుకొని పుట్టక ముందో, పురిటిలోనో చంపేస్తున్నారు. మరి కొన్ని చోట్ల ఎవ్వరికీ తెలియకుండా వదిలేసి వెళుతున్నారు. ఈ అమానుష సంఘటనలు అంతరించిపోవాలి. ఇప్పటికీ కొన్ని చోట్ల కొడు కులను అధికంగా చూసే సంప్రదాయం కొనసాగుతోంది. కొడుకుల కోసం ఏం చేసేందుకైనా, ఎంత ఖర్చు పెట్టేందుకైనా కొందరు తల్లిదండ్రులు వెనుకాడటం లేదు. ఆడపిల్ల ఆడ పిల్లనే కానీ ఈడ పిల్ల కాదని, ఎప్పటికైనా తమ ఇల్లు విడిచి వేరే ఇంటికి వెలుతుందనే అభిప్రాయం నేటికీ ఉంది.

అందుకే వారిని చదివించేందుకు, వారిపై ఎక్కువ డబ్బు ఖర్చు చేసేందుకు, ఆస్తుల్లో భాగం ఇచ్చేందుకు ఇష్టపడరు. కానీ కూతుళ్ల గుండెలపై బరువు అనుకోకుండా విలువ ఇవ్వాల్సిన అవసరం ఉందని మరచిపోతున్నారు. చరిత్ర పుటలను పరిశీలిస్తే కుమార్తెలు ఎప్పుడూ కుటుంబ గౌరవాన్ని కాపాడటంలో ప్రధాన పాత్ర పోషిస్తారని తెలుస్తోంది. పుట్టినింటికి, మెట్టినింటికీ సముచిత, సమున్నత గౌరవం తెస్తారని విస్మరించడం ఒకింత బాధాకరం. ఏ ఇంటికి వెళ్లినా తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ఏమైనా జరిగితే ఓర్చుకో లేక ఇట్టే తమ ప్రేమను పంచి చేతనైన సాయం చేయడానికి కూడా కూతుళ్లు వెనుకాడరు. ఇది వారి సహజ తత్వం అని గమనించడం లేదు.

ప్రాముఖ్యత

కుమార్తెల పట్ల ప్రేమ, అంకితభావం, ప్రశంసలను వ్యక్త పరుచడానికి ఈ దినోత్సవం ఒక అవకాశాన్ని కల్పిస్తుంది. మహిళలు, బాలికల శక్తి, విజయాలను గౌరవిస్తుంది. ఈ దినోత్సవం మన దేశం నుంచి ఇతర దేశాలకు విస్తరించింది. ఐక్యరాజ్య సమితి కూడా ఈ రోజును అంతర్జాతీయ ఆచారంగా గుర్తించింది. అప్పటి నుంచి ప్రపంచ కూతుళ్ల దినోత్సవం జరుపుకుంటున్నాం.

లెక్కలేం చెబుతున్నాయి?

తల్లిదండ్రులే వివక్షా పూరిత వైఖరిని ప్రదర్శిస్తే పిల్లల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తే ఇంకెవరూ వారికి న్యా యం చేయలేరు. యూనిసెఫ్ లెక్కల ప్రకారం అబ్బాయిల కంటే బాలిక ల మరణాల రేటు ఎక్కువగా ఉన్న దేశం మనదే. భారత దేశంలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 900 మంది అమ్మాయిలు ఉన్నారు. ప్రపం చ వ్యాప్తంగా అయిదేళ్ల లోపు మరణిస్తున్న బాలికల సంఖ్య మన దేశంలోనే ఎక్కువగా ఉంది. అందుకే ఆడ పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉంది.

మనమేం చేయాలి

కూతుళ్లను చదివించడంతో పాటు స్వాతంత్ర్యం ఇవ్వాలి. వారి కలలను నెరవేర్చడానికి చేయూత నివ్వాలి. కుమార్తెల సాధికారికత కోసం కృషి చేయాలి. కుటుంబ సభ్యులందరూ తమ ఇంట్లోని ఆడవాళ్లను



నేపథ్యం

కొన్ని సంస్కృతుల్లో కొడుకులకు ఇచ్చిన ప్రాధాన్యం కూతుళ్లకు ఇవ్వడం లేదని భావించి 2007 లో మన దేశంలో గ్రీటింగ్ కార్డ్స్ కంపెనీ అయిన ఆర్చీస్ లిమిటెడ్ కూతుళ్ల దినోత్సవాన్ని ప్రారంభించింది. ప్రతి యేటా సెప్టెంబరు నాలుగో ఆదివారం కూతళ్ల దినోత్సవం జరుపు కుంటారు. తల్లిదండ్రులు, వారి కుమార్తెల మధ్య ఉన్న ప్రత్యేక బంధాన్ని, కుమార్తెల శక్తిని, విజయాలను ప్రశంసించడానికి ఈ రోజు అంకితం చేయబడింది. లింగ సమానత్వంలో భాగంగా కొడుక్కి తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత, సంరక్షణ పొందే అవకాశం, అర్హత ఎంత ఉందో ఆ ఇంట్లో పుట్టిన కూతురికి కూడా అంతే ఉంటుందని ప్రజల్లో చైతన్యం తీసుక రావడమే ఈ ప్రత్యేక రోజు ముఖ్య ఉద్దేశ్యం.

కంటికి రెప్పలా చూసుకోవాలి. ఆడ మగ ఇద్దరినీ సమానంగా చూడాలి. అవకాశం ఇచ్చి ప్రోత్స హిస్తే ఆడవారు సైతం ఫలానా వారి బిడ్డ అని సగర్వంగా తలెత్తుకునేలా ఎన్నో అనూహ్య విజయాలు సొంతం చేసుకుంటారనే అక్షర సత్యాన్ని గమనించాలి. మన ఇంట్లో పుట్టిన ఆడ పిల్ల లంటే ఆడ బిడ్డలుగా భావించడమే కాదు ఈ అంశాన్ని అమలు లో పెట్టాలి. ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు బేటీ పడావో.. బేటీ బచావో ప్రచారాలను కూడా నిర్వహిస్తుంది. కేవలం ఒక ఆడపిల్లను మాత్రమే కన్న తల్లిదండ్రులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాయి. అందుకే మగ వారున్నా లేక పోయినా కంటే కూతుర్నే కనాలి.

ముగిసిన కాంగ్రెస్ ఆదివాసీ శిక్షణ శిబిరం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా గార్డెన్స్‌లో ఈ నెల 25న ప్రారంభమైన ఉమ్మడి జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ మూడు రోజుల శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ పోరాటయోధుడు గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్ భంగ్యా నాయక్, జనవిజ్ఞాన వేదిక రమేష్, ప్రముఖ రచయిత, కవి జయరాజ్, భూభారతి కమిటీ మెంబర్ సునీల్‌రెడ్డి అవగాహన కల్పించారు. మూడు రోజులపాటు జరిగిన శిబిరంలో రాష్ట్ర ఆదివాసీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన శిక్షణ శిబిరాల ద్వారా 1,200 మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. త్వరలోనే వీరందరితో కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు, ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధినేతల సమక్షంలో నిర్వహించే కార్యక్రమానికి శిక్షణపొందిన వారిని ఆహ్వానిస్తామన్నారు. ఇకపై నియోజకవర్గస్థాయిలో 100 మందితో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని, కరీంనగర్ జిల్లా నుంచి 500 మంది నాయకులను సమర్థవంతులుగా తయారు చేస్తామని అన్నారు. శిక్షణ శిబిరాలు పూర్తయిన అనంతరం పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో దాదాపు 100 మంది శిక్షణ పొందారు. రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ సెల్ సమన్వయకర్త కోట్యా నాయక్, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్, సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరిలాల్, ఆదివాసీ సెల్ నాయకులు కుర్ర పోచయ్య, బాదావత్ భాస్కర్, లావుడియా రంగ, కిషన్ నాయక్, గజల్ లాల్‌నాయక్, సుధాకర్ నాయక్, మాలోతు మహాలక్ష్మి, వినోద్ నాయక్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, నాయకులు రాజ్ కుమార్, బొబ్బిలి విక్టర్, గంగుల దిలీప్, పెద్ది గారి తిరుపతి, కుంభాల రాజ్ కుమార్, శ్రీమతి స్వప్న, కొంపెల్లి కీర్తి కుమార్‌ను ఆదివాసీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ సన్మానించారు.



శిక్షణపొందినవారికి ప్రశంసపత్రాలను అందజేస్తున్న బెల్లయ్యనాయక్, రచయిత జయరాజ్

డిప్యూటీ కలెక్టర్‌గా కన్నం హరిణి



డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన హరిణి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ విద్యానగర్‌కు చెందిన ఉపాధ్యాయ దంపతులు కన్నం రమేశ్, కళాప్రపూర్ణ జ్యోతిల రెండవ కూతురు కన్నం హరిణి డిప్యూటీకలెక్టర్‌గా నియమితులయ్యారు. గ్రూప్-1లో డిప్యూటీకలెక్టర్‌గా ఎంపికైన ఆమెకు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. హరిణి సోదరి ఒకరు డాక్టర్ అఖిల, మరొకరు మెడిసిన్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. సోదరుడు బాలాజీ బీబీఏ చదువుతు న్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులు కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో కృషిచేస్తానని అన్నారు. బాలిక దినోత్సవానికి ముందురోజు కూతురు డిప్యూటీ కలెక్టర్ ఉత్తర్వులు అందుకోవడం ఆనందంగా ఉందని ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

● నియామకపత్రం అందుకున్న నక్క శృతిహర్షిత



తల్లిదండ్రులతో నక్క శృతిహర్షిత

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన నక్క శృతిహర్షిత శనివారం డిప్యూటీకలెక్టర్‌గా నియామకపత్రం అందుకున్నారు. వరంగల్ జిల్లాకు పోస్టింగ్ పొందారు. శృతి హర్షిత జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 14వర్యాంకు సాధించింది. మల్టీజోన్ స్థాయిలో 6వ ర్యాంకు సాధించింది. అలహాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) బీటెక్ పూర్తి చేసింది. శృతిహర్షిత తండ్రి బాలయ్య వైద్యఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్, తల్లి సరస్వతి కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

చింతకుంటలో రామ్‌లీల ఉత్సవాలకు భూమిపూజ



రామ్‌లీల జరిపే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

భగత్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతకుంటలో నిర్వహించ నున్న రామ్‌లీల ఉత్సవాలకు కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే పండుగ దసరా అని, చింత కుంటలో మొదటిసారి రామ్‌లీల నిర్వహించడం అభినందనీయమని అన్నా రు. ఉత్సవానికి పూర్తి సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. కొత్తపల్లి ప్రజలు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్, మాజీ కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేష్, ఎవి రమణ, కాసారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ నాయకులకు స్ఫూర్తిదాయకం

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ ఈ తరం నాయకులకు స్ఫూర్తి దాయకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచ్చలేని నాయకునిగా, తెలంగాణ కోసం తన నివాసాన్నే త్యాగం చేసిన నాయకుడన్నారు. చేనేత సహకార ఉద్యమానికి నాయకత్వం వహించారని, నిజాంనిరంకుశ పాలనపై తిరుగుబావుటా ఎగురవేసి తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకను చాటిచెప్పార న్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో నూతన ఒరవడికి శ్రీకారం

● ఏటీసీ నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలి ● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో నూతన ఒరవడికి ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని ప్రభుత్వ ఐటీఐ సెంటర్‌ను అధునాతన సాంకేతిక కేంద్రంగా(ఏటీసీ) అప్‌గ్రేడ్ చేయగా, వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆరు కోర్సులతో ఏర్పాటు చేసిన ఏటీసీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏటీసీలో ఏర్పాటు చేసిన పరికరాలు, యంత్రాలు, వాటి పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ బాధ్యతలు చూస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత, విద్యార్థులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.2324 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 65 ఏటీసీ కేంద్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు వెల్లడించారు. రుద్రంగిలో రూ.43కోట్లతో ఐదుఎకరాల విస్తీర్ణంలో ఏటీసీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏటీసీల్లో నైపుణ్య శిక్షణ పొందిన యువతకు కనీసం రూ.20వేల ప్రారంభ వేతనంతో ఉపాధి లభించేలా అనేక కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు టాటా సంస్థ సహకారంతో వివిధ కోర్సులు ఏటీసీలో విద్యార్థులకు నేర్పిస్తున్నామని వివరించారు. జిల్లాలోని ఏటీసీల్లో 172మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి కోర్సులనే కాకుండా మంచి ఉపాధి అవకాశాలు సత్వరం లభించే ఏటీసీ కోర్సుల వైపు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ వేముల స్వరూప తిరుపతిరెడ్డి, రొండి రాజు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, ప్రిన్సిపాల్ కవిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



పరికరాలు, యంత్రాలను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద

● 39 గేట్ల ద్వారా 2,50,000 క్యూసెక్కులు దిగువకు



నీటితో నిండుగా ఉన్న ఎల్‌ఎండీ

జగిత్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరదనీటిరాక శనివారం పెరిగింది. 39 గేట్లుపైకి ఎత్తి 2,50,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువప్రాంతం నుంచి 2,61,263క్యూసె క్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టునీటినిల్వ80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 62.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా దిగువ గోదావరిలోకి నీరు వదలడం, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,50,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాగా ఈ యేడాది జూన్1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతంనుంచి ప్రాజెక్టులోకి 620.745 టీఎంసీ నీరు రాగా, 570.596 టీఎంసీల నీటిని వదిలారు.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్: దిగువమానేరు జలాశయం ఆరుస్పీల్‌వేగేట్ల నుంచి దిగువకు నీటివిడుదల కొనసాగు తోంది. ఎగువ మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీలోకి నీటివిడుదల పెరగ డంతో శనివారం సాయంత్రం 5.30గంటలకు ఎల్‌ఎండి 4స్పీల్ వేగేట్ల నుంచి 8వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా మరో రెండుగేట్లు ఎత్తి మొత్తం 6గేట్లనుంచి 12వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువద్వారా వెయ్యి క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరి రూపంలో 309క్యూసెక్కులు మొత్తం 13,309క్యూసెక్కుల నీరు దిగువకుఅవుట్‌ఫ్లో వెలుతోంది. మోయతుమ్మెద వాగునుంచి 10,095క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 5వేలక్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 1200క్యూసెక్కులు మొత్తం 16,295క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్‌ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.689టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సినీ రంగానికి దశ దిశ

భారతీయ సినిమాపై ప్రత్యేక ముద్ర


నేడు పైడి జయరాజ్ జయంతి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ సినిమా రంగానికి తెలంగాణ నుంచి అందులో కరీంనగర్ జిల్లా నుంచి వెళ్లిన నట ఆణిముత్యం, సినీ కళా వైతాళిక యశోమూర్తి పైడి జయరాజ్. సెప్టెంబర్ 28, 1909లో కరీంనగర్‌లో జన్మించిన జయరాజ్ హైదరాబాద్ నిజాం కళాశాలలో చదివి సినిమాలపై మోజుతో 1928లో ముంబాయి చేరుకున్నారు. సినిమాల్లో 70 ఏళ్ల పాటు ఓ వెలుగు వెలిగిన ఆయన 2000 సంవత్సరం ఆగస్టు 11న మరణించారు. ఆది వారం జయరాజ్ జయంతి సందర్భంగా ఓ కథనం.

● సినీ జీవితం

1928లో జయరాజ్ బాంబేలో మూకీ సినిమాల్లో హీరోగా నటించి జీవితాంతం హిందీ సినిమా రంగం భూమికగా ఎదిగి దేశ వ్యాప్త పేరు గడించారు. 1931లో అలంఆరాతో భారతీయ సినిమా రంగం మాటలు నేర్వక ముందే మూకీ యుగంలో సినిమాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. అత్యంత ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును 1980లో అందుకొని టవరింగ్ పర్సనాలిటీగా నిలిచారు. దర్శకుడిగా, నిర్మాతగా చెరగని ముద్ర వేశారు. జయరాజ్ 11 మూకీ, 156 టాకీ సినిమాల్లో హీరోగా అనేక సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించారు. 1945లో ప్రతిమ, 1951లో సాగర్, 1959 లో రాజ్‌ఘర్ సినిమాలకు దర్శకత్వం వహించారు. పీజే ఫిల్మ్ యూనిట్ బ్యానర్ మీద నర్గీస్ కథానాయికగా సాగర్ సినిమాను నిర్మించారు. హిందీ, ఉర్దూ, గుజరాతీ, మరాఠీ భాషల్లో నటించిన జైరాజ్ 1990లో ఖూన్‌భరీమాంగ్ టీవీ సీరియల్‌లో నటించారు.

తెలుగు నటుడు చిత్తూరు నాగయ్యతో కలిసి సినిమాను నిర్మించాలనుకున్నా తన మరణంతో ఆ ప్రాజెక్టు చేయలేక పోయారు. 1980లో ఫాల్కే అవార్డు అందుకున్న తొలి తెలంగాణీయుడు జయరాజ్. కాంగ్రెస్ ప్రభుత్వం పైడి జయరాజ్ పేరిట ఒక సినిమా అవార్డును నెలకొల్పి తొలి పురస్కారాన్ని సినీ దర్శకుడు మణిరత్నంకు అందజేశారు. పురస్కారం కింద గోల్డెన్ మెమొంటో, ప్రశంసాపత్రం, 10 లక్షల నగదును అందించారు. రచయిత, పాత్రికేయుడు, కఫిసో అధ్యక్షుడు రవిచంద్ర పైడి జయరాజ్‌పై డాక్యుమెంటరీ తీశారు.



పైడి జయరాజ్

స్వరాష్ట్ర సాధనకు కృషి చేసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ



కలెక్టరేట్, కమిషనరేట్‌లో లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న అధికారులు, సీపీ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరుగని పోరాటం చేశారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు 1969 ఉద్యమ సమయంలో మంత్రి పదవికి సైతం రాజీనామా చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుందన్నారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్ర సాధనకు కొండా లక్ష్మణ్‌బాపూజీ అలుపెరుగని పోరాటం చేశాడని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. బాపూజీ జయంతి సందర్భంగా కమిషనరేట్‌లో నివాళులర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఇంటిని, ఆస్తులను దానం చేశారని, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, స్వాతంత్ర్య పోరాటానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలు పోరాటం చేసి దేశ సేవకు అంకితమైన వ్యక్తి కొండ లక్ష్మణ్ బాపూజీ అన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, శేఖర్, సీసీ హరీష్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేశారు. పలువురు నాయకులను సన్మానించారు. నిర్వాహకులు మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, ఓదెల ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, మిట్టపల్లి మురళీధర్, ఐల రమేష్, సాయిరి మహేందర్, గుండా మురళి, రాజేంద్ర ప్రసాద్, పద్మశాలి కులబాంధవులు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాపూజీ జయంతి జరుపుకున్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, మేరుగు సారంగం, ఖ్యాతం వెంకటేశ్వర్లు, మేరుగు భీష్మచారి, రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా రాజేష్ థియేటర్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బండారి రాయమల్లు, ప్రధానకార్యదర్శి బూర్ల దామోదర్, సిరిమల్ల జయరాములు, మూర్తి, సతీష్, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): హనుమాన్ నగర్ పద్మశాలి భవన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి కేక్‌కట్ చేశారు. కొండా లక్ష్మణబాపూజీ జీవితం స్ఫూర్తిదాయకమని సంఘం నాయకులు పేర్కొన్నారు. దేవనపల్లి చక్రపాణి, సాంబారి రాజేష్, కుర్మ శ్రీనివాస్, ప్రభాకర్, కుమారస్వామి, రాజేశం, సత్యనారాయణ, సంపత్, కొంరయ్యలు పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్‌బాపుజీ జయంతిని పురస్కరించుకొని గాంధీచౌక్‌లోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, రాజుగౌడ్, కాయితి సమ్మయ్య, గొబ్బూరి వంశీ, శ్రీనివాస్, పిల్లి సత్తయ్య, జంజర్ల శేఖర్, ఇర్ఫాన్ రాజబాబులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బాపూజీ జయంతి నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తోట రాజ్‌కుమార్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లవెల్లి శంకర్, తాటికొండ శంకర్, మచ్చగిరి రాము, సంపత్ యాదవ్, లక్ష్మిమల్లు, అజయ్ పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. స్వచ్ఛత హీసేవాలో భాగంగా శనివారం రాత్రి నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఎకో ఫ్రెండ్లీ బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం అభివృద్ధిలో జరుగుతున్న మార్పును గమనించి ప్రతి మహిళ అండగా నిలువాలన్నారు. సమాఖ్యలవారీగా బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. శాంతి సమాఖ్య, వెన్నెలసమాఖ్యలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, తృతీయ బహుమతి సిరివెన్నెల సమాఖ్యలకు లభించాయి. అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, ఈఈ రామన్, మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ మౌనిక, సీఓలు, పీఆర్‌పీ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త బాధ్యతతో పని చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సూచించారు. క్యాంపు కార్యాలయంలో అంతర్గాం, పాలకుర్తి మండలాల ముఖ్య నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని, ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారికి సంక్షేమ కార్యక్రమాలు చేరేలా చూడాలన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): క్రాంతి మండల సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక అధ్యక్షతన శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఏపీఎం పల్లె లవకుమార్, మెడికల్ ఆఫీసర్ శ్రీచందన, ఎంపీఓ ఆరీఫ్, ఏపీఓ మంజుల, ఏఎన్ఎం సరోజన, సీసీలు జ్యోతి, ఉపేంద్ర, తిరుమల, రాజకుమారి మండల సమాఖ్య అధ్యక్షురాలు రవళి, వరలక్ష్మి, సిబ్బంది చంద్రకళ, తాజోద్దీన్, పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం లభిస్తుందని పరివార్ యోగా గురువులు రఘుసింగ్ బాపూజీ అన్నారు. శనివారం శారదానగర్ శిశుమందిర్‌లో జరిగిన యోగా శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోజు గంటపాటు యోగా సాధనతో వ్యాధులు దరిచేరవన్నారు. అంజనేయులు, భాస్కర్ల రాధ, కుమారస్వామి, మిట్ట లక్ష్మి, సత్యం, ఆది లక్ష్మి, భాస్కర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రలేఖన పోటీలు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడలో భాగంగా లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో శనివారం కాకతీయ జూనియర్ కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బీజేపీ రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సేవా పక్వాడ్ కార్యక్రమం ఇంచార్జీ కొండపర్తి సంజీవ్, జిల్లా ప్రధానకార్యదర్శి కోమళ్ళ మహేష్, ముస్కుల భాస్కర్‌రెడ్డి, ఐత పవన్, కోడూరి రమేష్, విశ్వాస్, బాలు, రాకేష్ పాల్గొన్నారు.

కల్వచర్లలో వైద్య శిబిరం

రామగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కల్వచర్లలో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఉచిత ఎక్స్‌రే క్యాంప్‌ను చేపట్టారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 150 మందికి ఎక్స్‌రే తీశారు. సిహెచ్‌వో సీతారామయ్య, డాక్టర్ దేవేందర్, ఏఎన్ఎమ్‌లు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

జాతీయ పర్యాటక దినోత్సవం

రామగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో బస్ షెల్టర్ వద్ద లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలనీలో నాల్గు బస్టాప్‌లలో మొక్కలు నాటారు. గౌడ సత్తన్న, శ్రీనివాస్, జంగతిరుపతి, రాజయ్య, రవీందర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇటీవల అసెంబ్లీలో సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర చిరంజీవి యువత కార్యదర్శి వీరమల్ల విద్యాసాగర్ రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో చిరంజీవిపై బాలకృష్ణ మాటలు అభిమానులను కలచివేశాయన్నారు.

నాగేపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నాగేపల్లిలో పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం శంకుస్థాపన చేపట్టారు. ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేసిన అంగన్వాడీ సెంటర్ భవనం, కల్వర్టు, స్కూల్ బిల్డింగ్ మరమ్మతులకు భూమి పూజ చేపట్టారు. నాయకులు ఎల్లె రామ్మూర్తి, తీగల సమ్మయ్య, వేగోలపు శ్రీనివాస్, ఎరుకలబాపురావు, వేగొలపు అంజయ్య, పొన్నంతిరుపతి, రాయమల్లు, రాజ్‌కుమార్, నాడెం శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు..

(5వ పేజీ తరువాయి)

● జిల్లాలో 13 గ్రామీణ మండలాలు ఉన్నాయి. 13 జడ్పీటీసీ స్థానాలకు, 13 ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. జడ్పీటీసీ స్థానాల్లో 3 ఎస్సీలకు, 6 బీసీలకు, 4 జనరల్‌కు కేటాయించారు. గతంలో కంటే బీసీలకు 3 స్థానాలు పెరిగాయి. జూలపల్లి ఎస్సీ మహిళకు, ధర్మారం, పాలకుర్తి ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, అంతర్గాం బీసీ మహిళకు, సుల్తానాబాద్, రామగిరి, మంథని బీసీ జనరల్‌కు, కమాన్‌పూర్, ఓదెల జనరల్ మహిళ, ఎలిగేడు, ముత్తారం జనరల్‌కు కేటాయించారు.

● ఎంపీపీ స్థానాలకు సంబంధించి ఎలిగేడు, పాలకుర్తి ఎస్సీ జనరల్, జూలపల్లి ఎస్సీ మహిళ, సుల్తానాబాద్, మంథని బీసీ మహిళ, ధర్మారం, అంతర్గాం బీసీ జనరల్, రామగిరి, పెద్దపల్లి, ఓదెల, కమాన్‌పూర్ జనరల్, కాల్వశ్రీరాంపూర్ జనరల్ మహిళ, ముత్తారం మహిళకు రిజర్వు అయ్యింది.

2019 ఎన్నికల్లో ఎస్సీలకు రెండు స్థానాలు కేటాయించగా, ఈసారి నాలుగు స్థానాలు స్టేట్ కోటా ప్రకారం కేటాయించగా, స్వల్పమార్పుతో మూడు స్థానాలకే పరిమితం చేశారు. బీసీలకు గతంలో 5 స్థానాలు ఉండగా, ఈసారి కూడా 5 స్థానాలే కేటాయించారు. 13 ఎంపీపీ స్థానాల్లో మహిళలకు సగం అంటే 6 లేదా 7 దక్కాల్సి ఉండగా, 5 స్థానాలే దక్కాయి.

సర్పంచులు, ఎంపీటీసీల రిజర్వేషన్లు

మంథని/మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు, 35 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. కన్నాల, ఎక్లాస్‌పూర్ ఎంపీటీసీ ఎస్సీ మహిళ, ఆరెంద ఎస్సీ జనరల్, గద్దలపల్లి, గుంజపడుగు, ఉప్పట్ల బీసీ జనరల్, అక్కెపల్లి, లక్కేపూర్ బీసీమహిళ, నాగెపల్లి, చిల్లపల్లి జనరల్, సూరయ్యపల్లి జనరల్‌మహిళ కేటాయించారు.

సర్పంచ్ స్థానాలు బెస్తపల్లి, తోటగోపయ్యపల్లి, లక్కెపూర్, గోపాల్‌పూర్, కన్నాల, భట్టుపల్లి, గుమ్నూనూరు, మల్లెపల్లి, అడవిసోమన్‌పల్లి బీసీ జనరల్, కాకర్లపల్లి, చిల్లపల్లి, గద్దలపల్లి, పోతారం, మైదుపల్లి జనరల్, అక్కెపల్లి, బిట్టుపల్లి, రచ్చపల్లి, గుంజపడుగు జనరల్ మహిళ, ఎక్లాస్‌పూర్, చిన్నఓదాల దుబ్బపల్లి, నాగారం, గాజులపల్లి, ఉప్పట్ల బీసీ మహిళ, సిరిపురం, విలోచవరం, ఖానాపూర్, మల్లారం, నాగెపల్లి ఎస్సీ మహిళ, పుట్టపాక, సూరయ్యపల్లి, నగరంపల్లి, ఖాన్‌సాయిపేట, ఆరెంద ఎస్సీ జనరల్, వెంకటాపూర్-ఎస్టీ జనరల్‌గా ఖరారు చేశారు.

బీసీలకు 109 సర్పంచ్ స్థానాలు..

జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో ఎస్సీలకు 51 స్థానాలు, ఎస్టీలకు 5 స్థానాలు, బీసీలకు 109 స్థానాలు, జనరల్‌కు 98 స్థానాలను రిజర్వు చేసినట్లు సమాచారం. ఎంపీటీసీ స్థానాలు 137 ఉండగా, ఎస్సీలకు 26 స్థానాలు, ఎస్టీలకు 3 స్థానాలు, బీసీలకు 58 స్థానాలు, జనరల్‌కు 50 స్థానాలు కేటాయించారని తెలుస్తున్నది.

ముత్తారం మండలంలో..

ముత్తారం మండలంలో 8ఎంపీటీసీ, 15 సర్పంచ్ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీలు అడవిశ్రీరాంపూర్, పారుపల్లి బీసీ జనరల్, ముత్తారం, మైదంబండ-బీసీ మహిళ, ఓడేడ్, ఖమ్మంపల్లి జనరల్ మహిళ, లక్కారం-జనరల్, ఇప్పలపల్లి-ఎస్సీ జనరల్‌గా ఖరారు చేశారు. సర్పంచ్ స్థానాలను అడవిశ్రీరాంపూర్-బీసీ మహిళ, దర్యాపూర్, ఇప్పలపల్లి, ముత్తారం జనరల్, హరిపురం, సీతంపేట బీసీ మహిళ, జిల్లల్లపల్లి, లక్కారం, మైదంబండ బీసీ జనరల్, కేశనపల్లి, మచ్చుపేట, ఓడేడ్ జనరల్‌మహిళ, ఖమ్మంపల్లి-ఎస్సీమహిళ, పారుపల్లి జనరల్, పోతారం-ఎస్సీ జనరల్‌గా ఖరారు చేశారు.

కాల్వశ్రీరాంపూర్ మండలంలో

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 సర్పంచ్‌లు, 12 ఎంపీటీసీ స్థానాలకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. సర్పంచ్‌లకు కాల్వశ్రీరాంపూర్, చిన్నరాత్‌పల్లి, పెగడపల్లి, మడిపల్లికాలనీ బీసీ జనరల్, ఇప్పలపల్లి, మల్యాల జనరల్, మీర్జంపేట, మొట్లపల్లి, పెద్దరాత్‌పల్లి, వెన్నంపల్లి, ఆరేపల్లి బీసీ మహిళ, కిష్టంపేట, ఇదులాపూర్, ఎస్సీ మహిళ, జాఫర్‌ఖాన్‌పేట, గంగారం, అంకంపల్లి, పెద్దంపేట, లక్ష్మీపూర్ మహిళ జనరల్, కూనారం, పందిల్ల ఎస్సీ జనరల్, మంగపేట, మడిపల్లి ఆశన్నపల్లి జనరల్‌కు కేటాయించారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లలో కాల్వశ్రీరాంపూర్ -1 ఎస్సీ జనరల్, కాల్వశ్రీరాంపూర్-2, గంగారం, మడిపల్లి జనరల్, మొట్లపల్లి, పందిల్ల, వెన్నంపల్లి బీసీ మహిళ, పెగడపల్లి, మీర్జంపేట బీసీ జనరల్, మల్యాల మహిళ జనరల్, మంగపేట జనరల్ మహిళ, కూనారం ఎస్సీ మహిళగా నిర్ణయించారు.

జూలపల్లి మండలంలో

జూలపల్లి: మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. అబ్బాపూర్ బీసీ మహిళ, జూలపల్లి 1 జనరల్ మహిళ, జూలపల్లి 2లో బీసీ జనరల్, కాచాపూర్ జనరల్, కుమ్మరికుంట బీసీ మహిళ, పెద్దాపూర్ ఎస్సీ జనరల్, తెలుకుంట ఎస్సీ మహిళ, వెంకట్రావుపల్లి జనరల్, వడుకాపూర్ బీసీ జనరల్‌కు కేటాయించినట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

అంతర్గాం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం యువతకు ఉపాధే లక్ష్యంగా పని చేస్తున్నదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. శనివారం పట్టణంలోని 20వ డివిజన్ పరిధిలో గల ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీసీ అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రంను ప్రారంభించి మాట్లాడారు. ఏటీసీ ద్వారా విద్యార్థులకు ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్, రోబోటిక్స్ వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రామగుండం ఏటీసీ కేంద్రం ఈ నియోజకవర్గానికి మైలు రాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ సురేందర్, కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, బల్వాన్‌సింగ్, ఈదునూరి హరి ప్రసాద్, యూసుఫ్‌ఖాన్, గౌస్ పాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

మంథని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశిష్ట హోమియోపతి సైంటిస్టు అవార్డు గ్రహీత డాక్టర్ సువర్ణ ప్రవీణ్‌కుమార్‌ను మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో న్యాయవాది లోకే రాధాకిషన్‌రావు ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకేందుకు వచ్చిన డాక్టర్ సువర్ణ ప్రవీణ్‌కుమార్‌ను మెమెంటో, శాలువా, పూలమాలలతో పనకంటి చంద్రశేఖర్, లోకే రాధాకిషన్‌రావు, లోకే మనోహర్‌రావు, అవధాని మోహన్‌శర్మ, టిక్కుగారి రాధాకిషన్‌రావులు సన్మానించారు. రావికంటి మనోహర్, టిక్కుగారికి రాధాకిషన్ ఎర్ర సురేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మరెన్నో అవార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.









గ్రామాల అభివృద్ధే లక్ష్యం

● పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

సుల్తానాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి పూసల రోడ్‌లో రూ.2.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో అంబేద్కర్ చౌరస్తా నుంచి గట్టెపల్లి రోడ్డు వరకు, మున్సిపల్ నుండి చెరువు గట్టు వరకు, చెరువు కట్ట నుండి గట్టెపల్లి రోడ్డు వరకు నిర్మాణం పనులు చేపడుతామన్నారు. ఆరు నెలల్లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆధునీకరించి పౌంటెయిన్ నిర్మాణం చేపడతామన్నారు. చెరువు కట్టను మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, నాయకులు పన్నాల రాములు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, నాయకులు దామోదర్‌రావు, అబ్బయ్యగౌడ్, చిలుక సతీష్, అమిరిశెట్టి రాజలింగం, తిరుపతి, పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.



సుల్తానాబాద్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఓదెలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ఓదెల, (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పొత్కపల్లి నుంచి రూపునారాయణపేట వరకు బీటీ రోడ్డు, మానేరు వాగు నుంచి వాటర్ ట్యాంక్ వరకు పైపులైన్, మహిళా సమైక్య భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, ఆలయ చైర్మన్ మొండయ్య, నారాయణరెడ్డి, రజినీకాంత్, మహేందర్, పాల్గొన్నారు. పొత్కపల్లి లక్ష్మిప్రసన్న ఫంక్షన్ హాల్లో 36 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ ధీరజ్ కుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే విజయరమణరావు అన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.2.30 కోట్లతో నిర్మించనున్న బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం అసంపూర్తిగా నిర్మించిన స్ట్రక్చర్‌ను బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్‌తో కలిసి ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రస్తుత కూరగాయల మార్కెట్ లోనే రూ.5 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆటాపాటలు.. దుర్గాదేవీ పూజలు...

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం లలితాదేవి అవతారంలో అమ్మవారు భక్తుల కు దర్శనమిచ్చారు. పవర్‌హౌస్‌కాలనీలోని దుర్గామాత ఆలయంలో అన్నదానం నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన చీరల వేలం నిర్వహించారు. జవహర్‌నగర్‌లోని జయదుర్గాదేవి ఆలయంలో మాలధారణ భక్తులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోల్‌సిటీటౌన్, : జయదుర్గాదేవి ఆలయంలో శనివారం జరిగిన చండీ హోమంలో కొప్పుల ఈశ్వర్-స్నేహలత దంపతులు పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, వేణుమలాని, ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రమణారావు పాల్గొన్నారు.



లలితాదేవి అవతారంలో అమ్మవారు

ఎలిగేడు: సుల్తాన్‌పూర్, ఎలిగేడులో దుర్గాదేవి మండపాల్లో భక్తులు, కుంకుమ పూజలు, అన్నప్రసాద సంతర్పణలు చేశారు. శ్రీకాంత్, శేఖర్, అనిల్, బన్నీ, సన్నీ, ప్రీతం, సాయి, రాకేష్, భక్తులు, తిరుపతి, హరీష్, పెద్ద కురుమ శేఖర్, శ్రీరామ్, సతీష్, పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రెవెన్యూ, హెల్త్, ఉపాధిహామీ మహిళా ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మవేడుకలను జరుపుకున్నారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీఓ బైరి కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ సిరిపురం గిరి, ఆర్ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి, పాల్గొన్నారు.

మంథని, : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో లోకే కుటుంబ సభ్యులు శనివారం అన్నదానం చేశారు. ఆలయానికి భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులకు లోకే కుటుంబ సభ్యులు అన్న ప్రసాదాల వితరణ చేశారు. లోకే సుధాకర్ రావు, న్యాయవాది రాధాకిషన్ రావు, మనోహర్ రావు, శ్రీధర్‌రావు, డాక్టర్ సురేష్, సేవకులు పాల్గొన్నారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా పోచమ్మ వాడలో ఏర్పాటు చేసిన భవాని మాత మండపంలో బీఆర్ఎస్ నేత పల్లి సత్తయ్య శుక్రవారం రాత్రి అల్పాహారాన్ని వితరణ చేశారు.

జీఎం కార్యాలయంలో బతుకమ్మ వేడుక

రామగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో శనివారం బతుకమ్మ వేడుకను నిర్వహించారు. జీఎం కార్యాలయం ఆవరణలో వివిధ విభాగాలకు చెందిన మహిళలు ప్రత్యేకంగా అలకరించిన బతుకమ్మల ఎదుట ఆటాపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు, ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు అలివేణి, వెంకటలక్ష్మి, వెంకటరమణ, భానుప్రసాద్, రామారావు, శ్రీనివాస్, మహేందర్, పాల్గొన్నారు.

ఓసీపీ-1లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం ఓసీపీ-1 ప్రాజెక్టులో ఐఎన్‌టీయూసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. 2024-25లో సంస్థ ఆర్జించిన లాభాల్లో 34 శాతం వాటా కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు రూ.5500 బోనస్ చెల్లించే నిర్ణయంపై హర్షంవ్యక్తం చేస్తున్నట్టు ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి తెలిపారు.

సింగరేణి సమాచారం

ఓసీపీ-2 ప్రాజెక్టును సందర్శించిన సేఫ్టీ జీఎం

రామగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2 ప్రాజెక్టును శనివారం జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్ సందర్శించారు. ప్రాజెక్టు మ్యాన్‌వేలో నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి వెళ్ళకుండా తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. ప్రాజెక్టు అధికారి వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

సోలార్ కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా కల్పించాలి

సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలో నాల్గు సంవత్సరాలుగా సోలార్ ప్లాంట్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి లాభాల వాటాను కల్పించాలని ఐఎన్టీ యూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్జీ-3 ఇంచార్జ్ ఉడుత శంకర్, కిర ణోరెడ్డిలు శనివారం ఏజీఎం శేఖర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.